క్లుప్తంగా

వేతనాలు ఎప్పుడిస్తారు మేడం ?



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ మల్లేశ్వరి

చిప్పగిరి: పెండింగ్ వేతనాలు ఎప్పుడు ఇస్తారని మండలంలోని దౌల్తాపురం గ్రామ ఉపాధిహామీ కూలీలు ఏపీడీ మల్లేశ్వరిని నిలదీశారు. గతంలో జరిగిన సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఫిర్యాదులు రావడంతో బుధవారం ఆమె గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వివరాలు కూలీలు, ఎఫ్ఏ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధి పనులు చేసి 12 వారాలు గడుస్తున్నా తమకు కూలి డబ్బులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ జుబేర్ అహ్మద్, టీఏ మారుతీ, ఎఫ్ఏ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇమాంసాహెబ్ ఉరుసు



ఇమాంసాహెబ్‌వలి దర్గా

మద్దికెర: మండల కేంద్రంలోని రైల్వేగేట్ వద్ద ఉన్న హజరత్ ఇమాంసాహెబ్ వలి స్వామి 323వ ఉరుసు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. గురువారం రాత్రి గంధోత్సవం, శుక్రవారం రాత్రి స్వామివారి షంషీర్ ఊరేగింపు కార్యక్రమం, 15వ తేదీ జియారత్ తదితర కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

మహిళలు పోరాటానికి సిద్ధం కావాలి



జెండా ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకురాలు

ఆలూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై మహిళలు పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు షేకన్ బీ అన్నారు. పట్టణంలోని జ్యోతి బసు భవన్‌లో బుధవారం భారత ప్రజాతంత్ర మహిళా సంఘం దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాడానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని గొప్పలు చెప్పిన ప్రభుత్వాలు వారి మాటలకే పరిమితమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి రత్నమ్మ, గౌసియా, నాగమణి, రాధమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ



భూమి పూజకు హాజరైన ఆర్డీఓ భరత్‌నాయక్

మద్దికెర: మండల కేంద్రం మద్దికెర పోలీస్‌స్టేషన్ ఎదురుగా బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టకు బుధవారం పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుహాసిని, ఈఓ శివకుమార్, మాజీ సర్పంచ్ శాంతన్న, బండారి ఆంజనేయులు, లాయర్ రామాంజులు, వలి, ధనుంజయ పాల్గొన్నారు.

నూతన ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

కృష్ణగిరి: మండల కేంద్రం కృష్ణగిరిలో బుధవారం గ్రామస్తులు నూతనంగా తయారు చేయించిన సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ ఏడాది శ్రీరామనవమి ఉత్సవాల కోసం విగ్రహాలను తయారు చేయించినట్లు తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ చందాలు ఇవ్వడంతో ఆ నగదుతో తయారు చేయించి గ్రామంలో ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించామని పేర్కొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

- ఎమ్మెల్యే బి.విరూపాక్షి
- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం
- కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు





ఆలూరులో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి , వైఎస్సార్‌సీపీ నాయకులు, దేవనకొండలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పత్తికొండ: పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్ నాగరాజు, నాయకులు

ఆలూరు: అట్టడుగు వర్గాలకు చెందిన వారు కూడా ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో రాణించేలా కృషి చేయాలనే దృఢ సంకల్పంతోనే 2011లో యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి అన్నారు. బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు కె.మల్లికార్జున ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక పాతబస్టాండు సమీపంలో వాల్మీకి విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు.

అంబేడ్కర్ విగ్రహం, ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల మధ్య ఎమ్మెల్యే కేక్ కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు.

వైఎస్సార్ బాటలోనే మాజీ సీఎం జగన్

దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలో బడుగులకు రాజకీయాలలో సముచిత స్థానం కల్పించడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. అదే బాటలోనే మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తూ అట్టడుగు వర్గాలకు తన పాలనలో కొలువులిచ్చి పెద్ద పీఠ వేశారని గుర్తు చేశారు. పార్టీని అంటిపెట్టుకుని ముందుకు కొనసాగితే వారికి ఎప్పటికీ బంగారు భవిష్యత్ ఉంటుందని చెప్పకోవడానికి తానే నిదర్శన మన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి, హొళగుంద అధ్యక్షుడు షఫివుల్లా, చిప్పగిరి సింగిల్ విండో మాజీ చైర్మన్ మల్లికార్జున, నాయకులు శ్రీరాములు, శేషప్ప, వరుణ్, భాస్కర్, రాజు, మండలకో-కన్వీనర్ వీరేష్, బాబు, మల్లప్ప, రాముడు, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బి.విరూపాక్షి జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన యువత పోరుకు తరలిళ్లే కార్యకర్తల వాహనాలను జెండాను ఊపి ప్రారంభించారు.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

పత్తికొండ రూరల్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ కారం నాగరాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విప్లవాత్మకమైన పాలన చూపించిన ఘనత పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి వారి గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. అమలుకు నోచుకోని హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటుకు సమాయత్తం అయ్యే రోజులు సమీపిస్తున్నాయని పేర్కొన్నారు. జగనన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడతామన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కోతిరాళ్ల సర్పంచ్ ఆంజినేయులు, తిమ్మరాజు, సహదేవుడు, నాగిరెడ్డి, సతీష్, సూరన్న, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

దేవనకొండ: మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జెడ్పీటీసీ కిట్టు, పార్టీ మండల కో కన్వీనర్ కబీర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను కార్యాలయం వద్ద ఎగురవేశారు. అంతకముందు బస్టాండు ప్రాంతంలోని దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆసుపత్రి నిర్మాణానికి స్థలం దానం



గ్రామంలోని స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి స్థలం విరాళంగా ఇచ్చేందుకు దాత మొగతాల్ సునీల్‌కుమార్ ముందుకు వచ్చారు. మండలంలోని తెర్నెకల్ గ్రామానికి రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వ ఆసుపత్రి మంజూరయ్యింది. గతంలో స్థల దాతలు ఎక్కడా ముందుకు రాకపోవడంతో గ్రామ సర్పంచ్ అరుణ్‌కుమార్ గ్రామకంఠంలోని సర్వేనంబర్ 46/1లో 1.50 సెంట్లు స్థలాన్ని సర్వే చేయించి తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ నుంచి అనుమతి తీసుకున్నారు. అలాగే టెండర్ ద్వారా అగ్రిమెంట్ కూడా చేయించారు. 2024 మార్చిలో ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ కూడా చేశారు. దీనికి సంబంధించిన మెటీరియల్ స్టీల్, సిమెంట్ కూడా దిగుమతి చేసుకున్నారు.

జగనన్న కాలనీలోని ఇళ్ల స్థలాల్లో నిర్మించే యత్నం

2024 మే తర్వాత కొందరు నాయకులు ఇక్కడ ఆసుపత్రి నిర్మాణానికి సరైన వసతులు లేవని జగనన్న కాలనీలో అనుకూలంగా ఉందని, పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను బలవంతంగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వెనక్కి తీసుకున్నారని సర్పంచ్ దృష్టికి వచ్చింది. పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను ఎందుకు వెనక్కి తీసుకుని ఇబ్బంది పెట్టాలని తలిచి గ్రామంలో కొందరు స్థలదాతలను సంప్రదించగా పెద్దింటి మొగతాల్ జీవరత్నం కుమారుడు మొగతాల్ సునీల్ కుమార్ స్వచ్ఛందంగా స్థలం ఇవ్వడానికి ముందుకొచ్చారు. సర్వేనంబర్ 36-1లో తన భూమిలోని ఒక ఎకరా భూమిని తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా ఇస్తానని తెలిపారు. దీంతో స్థల దాతను తీసుకెళ్లి జాయింట్ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.

స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ

పత్తికొండ ఆర్డీఓకు స్థల పరిశీలన చేయాలని జిల్లా అధికారులు ఆదేశించారు. ఇందులో భాగంగా బుధవారం ఆర్డీవో భరత్‌నాయక్ మొగతాల్ సునీల్‌కుమార్ పొలాన్ని పరిశీలించారు. జాయింట్ కలెక్టర్‌కు రిపోర్టు పంపుతామని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో దేవనకొండ తహసీల్దార్ ప్రసాద్‌రావు, వీఆర్వో షఫీ, స్థల దాత ఎం.సునీల్ కుమార్, గ్రామ సర్పంచ్ ఎం.అరుణ్‌కుమార్, మాజీ ఎంపీపీ చాప ఈరన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ



సరస్వతి పూజలో హెచ్‌ఎం, విద్యార్థినులు

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులతో సరస్వతి పూజ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం భ్రమరాంభ మాట్లాడుతూ.. పరీక్షల భయాన్ని వీడి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. పదో తరగతి తొలి మెట్టుగా భవిష్యత్‌కు ఉత్తమ బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం పది విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు.



సరస్వతి పూజలో పాల్గొన్న మద్దికెర విద్యార్థులు

ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు

మద్దికెర: విద్యార్థులు ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ రంగస్వామి అన్నారు. బుధవారం స్థానిక ఫ్రెండ్స్ విద్యానికేతన్ స్కూల్ నిర్వహించిన సరస్వతి పూజలో పాల్గొని పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆందోళనలు, భయాలు పెట్టుకోకుండా ధైర్యంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించేందుకు వీలుంటుందన్నారు. అనంతరం విద్యార్థులు, అధికారులకు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామాంజులు, ఉపాధ్యాయులు మల్లికార్జున, హనుమేశ్వర్లు, మస్తాన్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవార్లకు బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ

కృష్ణగిరి: మండల పరిధిలోని టి. గోకులపాడు గ్రామంలో గ్రామ దేవతల దేవరను బుధవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం పెద్దమ్మ, చిన్నమ్మ, కర్రెమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బంధువులతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పూజలందుకున్న పెద్దమ్మ

సింహ వాహనంపై శ్రీరంగనాథుడి విహారం

మద్దికెర మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథుని వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకీలో ఆలయ ప్రదక్షిణ చేశారు. రాత్రి స్వామివారు సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వీరయ్య పాల్గొన్నారు. – మద్దికెర



సింహవాహనంపై ఊరేగుతున్న శ్రీరంగనాథుడు

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు రూరల్: ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవ రావు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు ఈ నెల 17 నుంచి ప్రారంభమవుతుందన్నారు. మే 22వ తేదీ దరఖాస్తులకు తుది గడువు అని తెలిపారు. విద్యార్థులు http://cse.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ విద్యార్థులు దరఖాస్తు రుసుము రూ.200, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

చిప్పగిరి: మండలంలో మూడు జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏఓ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని రామదుర్గం, నగరడోణ, ఏరూరు గ్రామాల్లో ప్రభుత్వ జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. అమ్మడానికి ఆసక్తి కలిగిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

రహదారి మరమ్మతు పనులు ప్రారంభం

దేవనకొండ: మండలంలోని గద్దెరాళ్ల మారెమ్మవ్వ దేవర సందర్భంగా కర్నూలు రోడ్డు నుంచి గద్దెరాళ్ల గ్రామం వరకు మట్టి రోడ్డు మరమ్మతు పనులను బుధవారం రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 17, 18వ తేదీల్లో జరిగే గద్దెరాళ్ల మారెమ్మవ్వ దేవర ఉత్సవాల్లో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొంటారన్నారు. భక్తుల సౌకర్యార్థం రహదారి పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ ఉచ్చీరప్ప, గిడ్డయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కంగాటి రామ్మోహన్‌రెడ్డి

వెల్దుర్తి: బోయనపల్లె మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నర్సింగ్ నాగరత్నమ్మ(94) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతదేహానికి బుధవారం మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కోట్ల సుజాతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కంగాటి రామ్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దేశాయ్ సమీర్ కుమార్ రెడ్డి, బొమ్మన సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, బలరాంగౌడ్ నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులు కాంతారెడ్డి, సర్పంచ్ శివజ్యోతి, అశోక్‌రెడ్డిలను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు.

ఐదు నెలలు కాకుండానే ఆలూరు సీఐ బదిలీ



సీఐ బి.వి. చలపతి

ఆలూరు: బాధ్యతలు చేపట్టి ఐదు నెలలు నిండకుండానే ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటచలపతిని బదిలీ చేశారు. ఆయన వైఎస్సార్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో క్రైం జోన్ సీఐ పనిచేస్తూ ఆలూరు సీఐగా 14/11/2024న బదిలీపై ఇక్కడికి వచ్చి పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఆలూరు నియోజకవర్గంలో గతంలో కె.శ్రీనివాసనాయక్, ఎస్ఐ సి.వి.నరసింహులుపై కూడా పది నెలలు పూర్తి కాకుండానే బదిలీవేటు పడింది. కూటమి నేతల ఒత్తిడి కారణంగానే బి. వెంకటచలపతిని అన్నమయ్య జిల్లా రాయచోటి బదిలీపై వెళ్లిన్నట్లు తెలుస్తోంది. ఇక్కడికి ప్రస్తుతం అన్నమయ్య జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో సీఐగా విధులను నిర్వహిస్తున్న ఐ.రవిశంకర్‌రెడ్డిని ఉన్నతాధికారులు నియమించారు.

యువతకు అండగా..



నిరసనలో తుగ్గలి, పత్తికొండ మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు బుధవారం కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం వద్ద చేపట్టిన 'యువత పోరు' కార్యక్రమంలో పత్తికొండ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. విద్యా సంవత్సరం పూర్తవుతున్నా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా వారి జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. హామీలిచ్చి ప్రజలను వంచించడం చంద్రబాబు నైజమని ధ్వజమెత్తారు.

'యువత పోరు'కు తరలివెళ్లిన నాయకులు

హాలహర్వి: కర్నూలులో చేపట్టిన యువతపోరు కార్యక్రమానికి బుధవారం మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు వాహనాల్లో తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు హర్దగేరి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి జనార్దన్, మండల యూత్ నాయకులు గంగాధర, ఎంపీటీసీ గోపాల్, గూళ్యం వీరేశప్ప, గూళ్యం యల్లప్ప, బసవరాజు, గంగాధరగౌడ్, పల్లెరవి, సుంకన్న, రామయ్య తదితరులు వాహనాల్లో తరలివెళ్లారు.

సారా జోలికి వెళితే జీవితం నాశనం



మాట్లాడుతున్న హనుమంతరావు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు

వెల్దుర్తి: నాటుసారా తయారీ, అమ్మకంతో జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కర్నూలు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రావిపాటి హనుమంతరావు అన్నారు. బుధవారం ఎస్‌టీఎఫ్ ఏసీ సుధాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ సుధీర్ బాబుతో కలిసి కోడుమూరు ఎక్సైజ్ శాఖ పరిధిలోని వెల్దుర్తి, పుల్లగుమ్మి గ్రామాల్లో 'నవోదయం' కార్యక్రమం నిర్వహించారు. నాటుసారా తయారీ, అమ్మకంతో వల్ల జరిగే నష్టాలను వివరించారు. మానుకున్న వారికి జీవనాధారం కల్పిస్తామని హామీనిచ్చారు. మానని వారిపై చట్టపరమైన చర్యలు, పీడీ యాక్టు ప్రయోగానికి సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో సీఐ మంజుల, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ సుహాసిని, జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, ఏఎస్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

నాటుసారాతో జీవితాలు ఛిద్రం

దేవనకొండ: నాటుసారా తయారీ, అమ్మకాల వల్ల జీవితాలు ఛిద్రమవుతాయని పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేరరావు అన్నారు. బుధవారం సాయంత్రం దేవనకొండలో నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ నాటుసారా, అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. అలాగే జిల్లా బహిష్కరణ కూడా చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, ఎక్సైజ్ ఎస్ఐ సాయిప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయం ప్రారంభం



ఆలయంలో ప్రతిష్టించిన సేవాలాల్ విగ్రహం

తుగ్గలి: మండలంలోని లక్ష్మితండాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సేవాలాల్, మారెమ్మ దేవతల విగ్రహాల ప్రతిష్టాపన బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. చివరి రోజు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సేవాలాల్ మహారాజ్, మారెమ్మ దేవతల విగ్రహాలతో పాటు ఆలయంపై కలశ ప్రతిష్ట చేశారు. తండావాసులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేడు ఉచ్చీరప్ప తాత రథోత్సవం

ఆలూరు రూరల్ : మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో కొలువైన ఉచ్చీరప్ప, సలువప్ప తాతల రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇందు కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల సమయంలో రథోత్సవాన్ని లాగనున్నారు.



హొళగుంద వద్ద ఎల్లెల్సీలో కేరింతలు కొడుతూ స్నానం చేస్తున్న యువకులు, పిల్లలు

ఉల్లాసం.. ఉపశమనం

హొళగుంద: గత కొద్ది రోజుల నుంచి పెరిగిన ఉష్ణోగ్రత తీవ్రతతో జనం ఉదయం 11 గంటలు దాటితే ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఎండకాలం మొదలు కావడంతో సూర్యుడి తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. గడిచిన రెండు రోజులుగా మండలంలో 37 డిగ్రీల ఉష్ణోగ్రతం నమోదైవుతోంది. దీంతో మధ్యాహ్నం బస్టాండులు, వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గంటల తరబడి ఫ్యానుల కింద కాలం గడుపుతున్నారు. యువకులు, చిన్నారులు బావిలు, కాలువలకు చేరుకుని వెసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు. హొళగుందతో పాటు తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) పరిసర గ్రామాల్లో యువకులు, చిన్నారులు, పెద్దలు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈత కొడుతూ ఆనందంగా గడుపుతున్నారు. కాగా ఎల్లెల్సీకి ఈ నెలాఖరు లేదా ఏప్రిల్ 15న నీటి సరఫరాను నిలిపి వేయనున్నారు.